సుందరంగా జోన్-3 కార్యాలయం

- రూ.50 లక్షలతో ఆధునికీకరణ
- కార్పొరేట్ స్థాయిలో ముస్తాబు


జోనల్ కార్యాలయంలోని చాంబర్


కార్పొరేట్ స్థాయిలో జోనల్ కమిషనర్ గది

సీతమ్మధార : జీవీఎంసీ జోన్-3 కార్యాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. జీవీఎంసీ పరిధిలో ఒక్కో జోనల్ కార్యాలయం ఆధునికీకరణకు రూ.50 లక్షల చొప్పున వెచ్చించారు. ఇందులో భాగంగా ఆశీలమెట్ట అశోక్ నగర్‌లోని జోన్-3 కార్యాలయం ఆధునికీకరణ పనులు సార్వత్రిక ఎన్నికల సమయంలో చేపట్టారు. కొత్త ఫ్లోరింగ్, గోడలకు, బీరువాలకు రంగులు వేశారు. ఎలక్ట్రికల్ పనులు కూడా చేపట్టారు. కార్యాలయం ఇప్పుడు కొత్త శోభతో ఆకట్టుకుంటోంది. జోనల్ కమిషనర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో ఇంజినీర్లు ఈ పనులు చేపట్టారు. జోన్ పరిధిలో 14 నుంచి 27 వార్డులు ఉన్నాయి. ఈ వార్డులు తూర్పు, ఉత్తర నియోజకవర్గం పరిధిలో విస్తరించి ఉన్నాయి. ఆయా వార్డుల ప్రజలు నిత్యం పలు పనుల నిమిత్తం జోనల్ ఆఫీసుకి వస్తుంటారు. ఈ కార్యాలయంలో సౌకర్యం, రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, మలేరియా, యూసీడీ, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యశాఖ, తూర్పు నియోజకవర్గ ఓటర్ల నమోదు, తదితర విభాగాలు ఉన్నాయి. ఇక్కడ జీ+2 తరహాలో కార్యాలయం విస్తరించి ఉంది. మరమ్మతులు పూర్తి కావడంతో ఉద్యోగులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విధులు నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో కార్యాలయాన్ని ఆధునికీకరించారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆధునికీకరించిన జోనల్ కార్యాలయంలో సుందరంగా అధికారుల చాంబర్, కారిడార్


ఆధునిక హంగులతో మరుగుదొడ్డి

ఘనంగా కుంచుమాంబ మారువారం పండగ


కుంచుమాంబ ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట : అక్కయ్యపాలెం జగన్నాథపురంలో మూడు గుళ్ల వద్ద కొలువైన కుంచుమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి తెల్లవారుజామున అభిషేకాలు, కుంకుమ పూజలు జరిపించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నదానం ఏర్పాటు చేయగా సుమారు 3 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పాలమరశెట్టి ప్రసాద్, అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ఆడారి పారుపల్లి రవి, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ రాజగిరి సింహాచలం, పిల్లా గోపి, రాజగిరి అప్పలరాజు, కర్రి అచ్యుతరావు, టి.టి.శివ, మాలి నాయుడు, పద్మ, ఉమ, కుమారి పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ మహిళలు శాశ్వత ప్రాజెక్టు వర్క్ అమలులో భాగంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు మంగళవారం ఉపకార వేతనాలు అందించారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 10 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉపకార వేతనాలతో పాటు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ రంగారావు, క్లబ్ పూర్వ అధ్యక్షురాలు వి.జయప్రభ శర్మ ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు అందరికి ఆదర్శంగా నిలుస్తారని వాకర్స్ డిస్ట్రిక్ట్-101 పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.హేమలత, డిస్ట్రిక్ట్ 101 కార్యదర్శి బలిరెడ్డి సత్యనారాయణ, పూర్వ అధ్యక్షులు జె.ఉమాదేవి, జయప్రభాశర్మ, ఉపాధ్యక్షురాలు పి.మహాలక్ష్మి, జాలివాకర్ ఎం.ప్రమీల రావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనాల తనిఖీ


బిర్లా జంక్షన్‌లో వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మర్రిపాలెం : కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకుండా, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారుల దస్త్రాలు మంగళవారం ఉదయం బిర్లా జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ, సిబ్బంది పరిశీలించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిని, ట్రిపుల్ రైడింగ్ చేసిన వారిని హెచ్చరించారు. ఆటోలను కూడా తనిఖీ చేశారు.

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుని సత్కరిస్తున్న సభ్యులు

సీతమ్మధార : బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తెలిపారు. బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి విశాఖ పార్లమెంట్ కన్వీనర్ వంగూరి గణేష్ ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ కూటమి పార్టీలు రూపొందించిన మేనిఫెస్టోలోనీ అంశాల అమలుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయిరాం, అడ్వకేట్ చరణ్, రాజేష్, ఆదిభట్ల శ్రీనివాస్, భగవాన్, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు మర్రిపాలెం మహారాణిపేటలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు సంరక్షించాలని సూచించారు. ముందుగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాకేష్ చంద్ర, సంజీవరావు, ఆది, రాము, మధు, రాజు, ప్రకాష్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో విఘ్నేశ్వరుడు

సీతమ్మధార : స్థానిక సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శ్రీమహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు. గణపతి పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో విఘ్నేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు.

భక్తిశ్రద్ధలతో సువాసిని పూజ


ప్రత్యేక అలంకరణలో లలితాదేవి


సువాసిని పూజలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం సువాసినీ పూజ నిర్వహించారు. సుమారు 300 మంది మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజ ఆచరించారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి సమక్షంలో పండితుల వేదమంత్రాల మధ్య ఈ పూజను శాస్త్రోక్తంగా చేశారు. పీఠం దర్బారు హాల్లో లలితాదేవిని పూలదండలతో అలంకరించారు. ముందుగా సామూహిక లలిత సహస్ర పారాయణ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పీఠం మేనేజర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని పాల్గొని భక్తులను ఆశీర్వదించారు.

భక్తసత్కీర ...

భక్తనత్కీర నాటక ప్రదర్శన నేడు

మీగడ రామలింగస్వామి బృందం సభ్యులతో బుధవారం సాయంత్రం 6 గంటలకు లలితా పీఠంలో 'భక్తనత్కీర'నాటకం ప్రదర్శన జరుగుతుందని పీఠం మేనేజర్ కృష్ణసేన్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డ్రగ్స్ వినియోగంతో భవిష్యత్ నాశనం


పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీవీపీ ఇన్‌స్పెక్టర్ నాయుడు

సీతమ్మధార : మాదక ద్రవ్యాల వినియోగంతో బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో(సెబ్) స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టీవీపీ నాయుడు హెచ్చరించారు. పీ అంట్ టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ పాఠశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం(26న) పురస్కరించుకుని డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సరదాగా, ఫ్యాషన్‌గా మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే వ్యసనపరులుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్టు తెలిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్ వైపు ప్రేరేపిస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో సెబ్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ముసలనాయుడు, హెడ్ కానిస్టేబుల్ సత్యం, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి


మాట్లాడుతునన్న డీసీపీ మోకా సత్తిబాబు

మర్రిపాలెం: మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని జోన్-2 డీసీపీ మోకా సత్తిబాబు సూచించారు. 51వ వార్డు మాధవధార వుడా కాలనీ 48 లాస్ట్ బస్‌స్టాప్ సమీప ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం సాయంత్రం డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా యువత మేలుకో-భవితను మలచుకో-డ్రగ్స్‌ను వదులుకో అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడి జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపామని, ఇప్పటికే గంజాయి, మత్తు పదార్థాలు వినియోగిస్తున్న పలు ప్రాంతాలపై నిఘా పెట్టామన్నారు. గంజాయి రవాణాపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి, సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రైం డీసీపీ నాగరత్నం, వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

గిరి మహిళకు అండగా..

సత్వరం వైద్యం చేయాలని ఆదేశించిన ఎంపీ డాక్టర్ తనూజారాణి


గిరిజన మహిళ మర్రి గాసమ్మ

మహారాణిపేట: విశాఖ కేజీహెచ్‌లో 13 రోజులుగా వైద్యం అందక అవస్థ పడుతున్న గిరిజన మహిళకు అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజారాణి అండగా నిలిచారు. అరకులోని పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీలోని పెదగొంది గ్రామానికి చెందిన మర్రి గాసమ్మ (34) ఈనెల 12న చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌లో చేరింది. నేటికి 13 రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఆమెకు ఎలాంటి వైద్యం అందలేదు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ తనూజారాణి స్పందించారు. ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఆమె కేజీహెచ్ వర్గాలతో చరవాణి ద్వారా మాట్లాడారు. రోగి సమస్యను వారికి వివరించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీ ఆదేశించడంతో తక్షణం వైద్యులు స్పందించారు. గురువారం శస్త్ర చికిత్స చేయడానికి కేజీహెచ్ వైద్యులు అంగీకరించడంతో వారిని ఎంపీ తనూజారాణి అభినందించారు.

హ్యూమన్ రైట్స్ కోర్సులను పునరుద్ధరించాలి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో హ్యూమన్ రైట్స్ కోర్సులను పునరుద్ధరించాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ కోరారు. మంగళవారం ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య కె.సీతామాణిక్యంను కార్యాలయంలో కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం నుంచి ఏయూలో ఈ కోర్సుల నిర్వహణ జరుగుతోందని, వీటిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయడానికి ఈ కోర్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించి.. జోరుగా వ్యాపారాలు

పాదచారులు.. వాహన చోదకుల అవస్థలు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్-3 పరిధిలో జోరుగా ఆక్రమణలు సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. 27వ వార్డు ద్వారకానగర్‌లో ఇప్పటికే పలు ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కారణంగా పాదచారులు తీవ్ర అవస్థలు పడుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడి డైమండ్ పార్కు ఎదురుగా రోడ్డును ఆక్రమించి పార్లర్ నిర్వహించటం గమనార్హం. రండి బాబు రండి వేడి వేడి బిర్యానీ అంటూ సిబ్బంది వినియోగదారులను పిలుస్తూ అబిడ్స్ పేరిట పార్లర్ నిర్వహిస్తున్నారు. దుకాణం అద్దె లేదు.. రోడ్డును ఆక్రమించి నిర్వహిస్తున్నారు కనుక రేట్లు తక్కువగా ఉంటాయనుకుంటే పొరపాటు పడినట్టే. ఇక్కడ ధమ్ బిర్యానీ ధర రూ.150. ఇతర వంటకాల ధరలు కూడా భారీగానే ఉన్నాయి. ఇక్కడికి సమీపంలోనే జోనల్ కార్యాలయం ఉన్నా సరే టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. రోడ్డును ఆక్రమించి పార్లర్ నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోందని, పాదచారులు సైతం ఇక్కట్లు పడుతున్నారని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ఇంకొందరు కూడా ఫుట్‌పాత్‌లు, రోడ్డు మీదే రెస్టారెంట్లు నిర్వహిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జోన్-3 టౌన్‌ప్లానింగ్ అధికారులు, పోలీసులు స్పందించి రోడ్డుపై నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.


డైమండ్ పార్కు ఎదురుగా రోడ్డుపై టేబుల్స్

వైభవంగా స్నపన తిరుమంజనం


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన


స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగుల సమావేశం నేడు

మురళీనగర్: హిందుస్థాన్ షిప్‌యార్డు రిటైర్డ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం మాధవధార మున్సిపల్ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించనున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు దాటిన 15 మంది సభ్యులను సూపర్ హీరోస్ టైటిల్‌తో సత్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వై.అప్పారావు పర్యవేక్షణలో వినోద కార్యక్రమాలు ఉంటాయని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

జగదాంబ: భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని జీవీఎంసీ జోన్-4 టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ కమిషనర్ ఝాన్సీలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె జోనల్ కార్యాలయంలో మాట్లాడుతూ జోన్ పరిధిలో కొత్తగా భవనాలు నిర్మాణాలు చేపడుతున్న వారందరూ తప్పనిసరిగా జీవీఎంసీ అనుమతులు తీసుకోవాలన్నారు. అదే విధంగా నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలన్నారు. అదనంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంద గజాలలోపు నిర్మాణాలకు కూడా ప్లాన్ తప్పనిసరి అన్నారు.కార్యక్రమంలో సిబ్బంది విశ్వనాథం, పవన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ భవనానికి విరాళం


చెలికాని సీతారామయ్యకు విరాళం చెక్కు అందిస్తున్న ద్వారకానాథ్, సత్యనాథం

మురళీనగర్: నగరంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన వాకర్స్ ఇంటర్నేషనల్ భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందించేందుకు మురళీనగర్ వాకర్స్ క్లబ్ ముందుకు వచ్చింది. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ దేశ, విదేశాల్లో 1450 శాఖలను కలిగి ఉంది. దీనికి అత్యాధునిక భవనాన్ని నిర్మించాలని తలపెట్టారు. దీంతో మురళీనగర్ వాకర్స్ క్లబ్ తన తరపున విరాళాన్ని ప్రకటించింది.

ఈ మేరకు అమలాపురంలో ఇటీవల నిర్వహించిన గవర్నర్‌ల శిక్షణ శిబిరంలో రూ.లక్ష చెక్కును వాకర్స్ ఇంటర్నేషనల్ నిర్మాణ కమిటీ కన్వీనరు చెలికాని సీతారామయ్యకు వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, వాకర్స్ ఇంటర్నేషన్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం అందజేశారు.

30న చిత్రలేఖన, ఉపన్యాస పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐవైఎఫ్ఎస్ సభ్యులు

సీతంపేట : ఇండియా యూత్ ఫర్ సొసైటీ (ఐవైఎఫ్ఎస్), ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గాంధీ సెంటర్ సయుక్తంగా ఈ నెల 30న ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు పర్యావరణ ఇంజినీర్ పి.వి. ముకుందరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను ఇండియా యూత్ ఫర్ సొసైటీ బృందం మంగళవారం ఆవిష్కరించారు. 5 నుంచి 15 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చని, 89780 19596కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు అదే రోజు బహుమతులు అందజేస్తామని తెలిపారు. పర్యావరణం, జంతు పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించడానికి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

53వ వార్డులో ఆటో అపహరణ


అపహరించుకుపోయిన ఆటో

మర్రిపాలెం : జీవీఎంసీ 53వ వార్డులో ఓ ఆటో దొంగతనానికి గురైంది. శ్రీహర్షనగర్ రైల్వేక్వార్టర్స్ వద్ద సోమవారం పార్కు చేసి ఉన్న ఆటోను మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు టి.గణపతి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు అదే ఆటోపై సింహాచలం అప్పన్నపాలెం సమీపంలో స్క్రాప్ షాపు నిర్వహిస్తున్న సర్వేశ్వరరావు అనే వ్యక్తి వద్దకు ముగ్గురు యువకులతోపాటు ఓ యువతి మంగళవారం ఉదయం వెళ్లారు. ఆటో పాడైపోయిందని, మరమ్మతులు చేపట్టేందుకు పరికరాలు కావాలని సదరు షాపు యజమానిని అడిగారు. దీంతో అతడు ఇచ్చేందుకు సిద్ధమవ్వగా ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచారు. అనంతరం అక్కడే ఉన్న క్యాష్ బాక్స్‌లోని రూ.10 వేలు అపహరించుకునిపోయారు. ఇంతలో విషయం తెలుసుకున్న సర్వేశ్వరరావు కుమారుడు శ్రీనివాసరావు ఘటనా స్థలికి చేరుకుని స్క్రాప్ షాపులో ఉన్న సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా ఆటోలో ముగ్గురు యువకులతోపాటు ఓ యువతి వచ్చినట్టు గుర్తించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.